పాఠకులకు గమనిక

దసరా పర్వదినం సందర్భంగా
21-10-26 , 22-10-26 పత్రికకు
సెలవు.
తదుపరి సంచిక 23-10-26
యథావిధిగా వెలువడుతుంది.

యాజమాన్యం

ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 20 మంగళవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 13 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

TUESDAY OCTOBER 20 2026 | VOL:1 | ISSUE: 13 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్.. పొదుపు బాటలో ప్రభుత్వం!

- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల వాడకంపై ఆంక్షలు విధింపు
- పరిశ్రమలకు విద్యుత్ కోతలు ఉండవని స్పష్టం చేసిన సర్కార్
- తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కార్యాచరణ
- హైదరాబాద్‌లో అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక డ్రైవ్



ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో విద్యుత్, నీటి వినియోగం గణనీయంగా పెరిగింది. మరోవైపు ఉత్పత్తి, లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పొదుపు చర్యలతో పాటు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఎయిర్ కండిషనర్లను (ఏసీ) వినియోగించవద్దని, వాటిని కూడా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్దే నిర్వహించాలని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ, వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా సరఫరా అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, పారిశ్రామిక యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అన్ని థర్మల్ పవర్ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే తాగునీరు, విద్యుత్ కొరతను నివారించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంజయ్ జాజు సూచించారు. ఈ అంశంపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం, కేబినెట్ సబ్-కమిటీ భేటీ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

కరవు, ఎల్ నినో ఎఫెక్ట్.. రంగంలోకి దిగిన టీజీ ప్రభుత్వం, ఆరుగురు మంత్రులతో కమిటీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కమిటీ చైర్మన్ బాధ్యతలు
- కమిటీలో మొత్తం ఆరుగురు మంత్రులకు చోటు
- కరవు పరిస్థితులను పర్యవేక్షించి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న కమిటీ

రాష్ట్రంలో నెలకొన్న కరవు, ఎల్ నినో పరిస్థితులను సమీక్షించి, నివారణ చర్యలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

(మిగతా 2వ పేజీలో..)



కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు.. కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

- మహేశ్ గౌడ్, పొంగులేటి, వంశీకృష్ణకు బీఆర్ఎస్ నోటీసులు
- నోటీసులు జారీ చేసిన సోమ భరత్ కుమార్
- తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని సూచన
- స్పందించకపోతే పరువు నష్టం సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

కొండపోచమ్మ సాగర్ నీటిని

(మిగతా 2వ పేజీలో..)







ఫ్లంబర్ కథనంపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్

- దుబాయ్ విమాన ఘటనపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్
- విమానాన్ని ఫ్లంబర్ కాపాడాడన్న ప్రచారాన్ని కెప్టెన్ వివరణ
- ఆ సమయంలో విమానాన్ని కాపాడటంపైనే నా దృష్టి ఉందన్న పైలట్

(మిగతా 2వ పేజీలో..)

విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు.. 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే!

- విజయ్ టీవీకేకు 2025-26లో రూ.13.3 కోట్ల విరాళాలు
- మొత్తం విరాళాల్లో ఆధవ్ అర్జున, ఆర్‌వీ రంజిత్‌కుమార్ నుంచే 99 శాతం విరాళాలు
- రూ.8.2 కోట్లు అందించిన ఆధవ్ అర్జున
- రంజిత్‌కుమార్ రూ.5 కోట్ల విరాళం
- అన్నాడీఎంకేకు రూ.161.35 కోట్లు, డీఎంకేకు రూ.191.19 కోట్ల విరాళాలు



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.13.3 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందాయి. ఈ మొత్తంలో దాదాపు 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే వచ్చినట్లు భారత ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. క్రీడలు, ప్రజాపనుల శాఖ మంత్రి ఆధవ్ అర్జున, మరో మంత్రి ఆర్‌వీ రంజిత్‌కుమార్ ఈ విరాళాల్లో ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు.ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాల ప్రకారం.. ఆధవ్ అర్జున రూ.8.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. రంజిత్‌కుమార్ రూ.5 కోట్లు అందించారు. దీంతో పార్టీకి అందిన మొత్తం విరాళాల్లో అర్జున వాటా 60 శాతానికి పైగా ఉంది. టీవీకేకు అత్యధికంగా విరాళం ఇచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారు. ఈ ఇద్దరి విరాళాలతో పాటు మరో రెండు విరాళాలు కూడా పార్టీకి అందాయి. తూత్తుకుడి జిల్లా లయన్స్ టౌన్‌లో ఉన్న స్నో షో సంస్థ రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇచ్చింది. అదే చిరునామాలో నమోదైన స్నో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ కూడా మరో రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందించింది. ఓవరాల్ గా ఈ నాలుగు విరాళాల మొత్తం రూ.13.3 కోట్లుగా ఉంది.ఇదిలా ఉండగా 2025--26 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే సుమారు రూ.161.35 కోట్ల స్వచ్ఛంద

(మిగతా 2వ పేజీలో..)



కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత.. ప్రభుత్వానికి హెచ్చరిక

- నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలని కవిత డిమాండ్
- లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిక
- మేడిగడ్డను చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచన

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో

(మిగతా 2వ పేజీలో..)



ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, ప్రభుత్వ సృష్టించిన కరవు: నిరంజన్ రెడ్డి

- రైతుల కష్టాలకు ప్రభుత్వ అసమర్థతే కారణమన్న నిరంజన్ రెడ్డి
- శ్రీశైలంలో 70 టీఎంసీల నీరున్నా పాలమూరు, కల్వకుర్తి పంపులు నడపడం లేదని ఆరోపణ
- నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమర్థతే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం!

భూ భారతి అమలుతో పారదర్శక రెవెన్యూ వ్యవస్థకు శ్రీకారం

రీ-సర్వేతో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం 12.40 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు భూ హక్కుల కల్పనలో వేగం పెంచాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

(మిగతా 2వ పేజీలో..)





ఓటర్ల జాబితాతో బీజేపీ కుట్ర: అఖిలేశ్ యాదవ్

- దొంగ ఓట్లను చేర్పిస్తూ, ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారని అఖిలేశ్ విమర్శ
- పోలింగ్ బూత్‌ల వద్ద కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ

తన బలంగా భావిస్తుందని వ్యాఖ్య

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్రపూరితంగా ఓటర్ల జాబితాను తారుమారు చేస్తోందని, దొంగ ఓట్లను చేర్పించడంతో పాటు ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తోందని ఆయన విమర్శించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద పార్టీ కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే అధికారులకు

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్.. పొదుపు బాటలో ప్రభుత్వం!

(మొదటి పేజీ తరువాయి)

నీటి కష్టాలు.. అక్రమ మోటార్లపై ఉక్కుపాదం

స్థానిక నీటి వనరుల నుంచి వ్యవసాయానికి అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడేస్తుండటంతో, విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఇంధన శాఖ అధికారులు సమావేశంలో వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత లేకపోవడంతో, అక్కడి నుంచి అందాల్సిన 110 మిలియన్ గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ (60 వీ+ణ), కృష్ణా నది వంటి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలకు, ఇతర పనులకు కొత్త బోర్ల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. నగరంలో మున్సిపల్ నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుతున్న వారిపై 'హైడ్రా' సహకారంతో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణాలకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని (ఎస్‌టీపీ వాటర్) సరఫరా చేయనున్నట్లు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుతున్నాయని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేస్తున్నామని మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు.

ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు.. కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుదు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గద్దం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుదు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

కరవు, ఎల్ నినో ఎఫెక్ట్.. రంగంలోకి దిగిన టీజీ ప్రభుత్వం, ఆరుగురు మంత్రులతో కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.ఈ సబ్ కమిటీలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరించనుండగా, ప్రణాళికా శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు.రాష్ట్రవ్యాప్తంగా కరవు పరిస్థితులను ఈ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుంది. సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తుంది. నైరుతి రుతుపవనాల సమయంలో రాష్ట్రంలో 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో అనేక మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కరవు నివారణ చర్యలపై దృష్టి సారించి, ఈ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం!

హైదరాబాద్, అక్టోబర్ 19:

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భూ భారతి చట్టం అమలు, రెవెన్యూ శాఖ పనితీరుపై సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మించడంతోపాటు భూ సంబంధిత సేవల్లో పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భూ హక్కుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

12.40 లక్షల మంది రైతులకు పాస్ పుస్తకాలు

గత 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 5,68,858 పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. భూముల రికార్డుల్లో పారదర్శకత, హక్కుల నిర్ధారణకు ప్రాధాన్యమిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

రీ-సర్వేతో పాత సమస్యలకు పరిష్కారం

దశాబ్దాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు రీ-సర్వే ద్వారా పరిష్కారం చూపే అవకాశం ఉందని పొంగులేటి పేర్కొన్నారు. భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగుదారులను గుర్తించడం ద్వారా అర్హులకు చట్టబద్ధమైన భూ హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. భూముల వివరాల్లో తప్పులు, హక్కులకు సంబంధించిన వివాదాలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నారాయణపురంలో 906 మంది రైతులకు హక్కులు

భూ హక్కుల కల్పనలో చేపట్టిన చర్యలను వివరిస్తూ నారాయణపురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించినట్లు వెల్లడించారు. ఈ తరహా చర్యల ద్వారా అర్హులైన రైతులకు భూమిపై చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలకు వెసులుబాటు

పట్టాదారు పాస్ పుస్తకాల జారీతో రైతులకు బ్యాంకు రుణాలు పొందడంతోపాటు రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి వివరించారు. భూ రికార్డుల సమస్యల కారణంగా రైతులు సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చూడాలని సూచించారు. అర్హులైన రైతులకు ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో రీ-సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూ హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు సత్వర న్యాయం అందించడంతోపాటు, భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.



కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత.. ప్రభుత్వానికి హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్లంబర్ కథనంపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ప్రమాదం నుంచి ఫ్లైదుబాయ్ విమానాన్ని ఓ ప్లంబర్ తన సమయస్ఫూర్తితో కాపాడారంటూ వస్తున్న వార్తలను ఆ విమాన పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందించారు. ఆ ప్లంబర్ గురించి తనకు కనీస సమాచారం కూడా లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం యూఏఈలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న పైలట్ స్మిత్, అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో ఎమర్జెన్సీ తలెత్తిన సమయంలో, ప్రయాణికుడిగా ఉన్న యానివ్ హయూన్ అనే ప్లంబర్ తన సాహసంతో ప్రమాదాన్ని నివారించినట్లు వార్తలు వచ్చాయి. 'ఎయిర్ క్రాష్ ఇన్వెస్టిగేషన్' అనే టీవీ షోలో చూసిన అంశాలను ఆధారంగా చేసుకుని, కంట్రోల్ స్టిక్స్‌ను వెనక్కి లాగి విమానాన్ని స్థిరపరిచానని హయూన్ గతంలో పేర్కొన్నారు. అనంతరం విధుల్లో లేని మరో పైలట్ సహాయంతో విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు వివరించడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది.ఈ కథనాలపై కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందిస్తూ, "నిజం చెప్పాలంటే ఆ ప్లంబర్ ఉదంతం గురించి నాకేమీ తెలియదు. విమానంపై ఆకస్మిక దాడి జరిగినప్పుడు, అది కూలిపోకుండా కాపాడేందుకే నేను సర్వశక్తులు ఒడ్డాను. నన్ను నేను రక్షించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించాను" అని వెల్లడించారు. విమానం కెప్టెన్ నియంత్రణలోనే ఉందంటూ ఓ సీనియర్ అధికారి చెప్పిన మాటలు మాత్రమే తనకు గుర్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఒక ప్లంబర్ విమానాన్ని ల్యాండ్ చేయగలడా అనే ఊహాగానాలపై తాను స్పందించబోనని ఆయన స్పష్టం చేశారు.దాడి జరిగిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు తనకు పూర్తిగా గుర్తులేవని కెప్టెన్ స్మిత్ వివరించారు. తీవ్రమైన దాడి జరుగుతున్నప్పటికీ, ఎంతో శ్రమించి తన సీట్ బెల్ట్ విప్పుకుని కాక్‌పిట్ తలుపులు తెరిచినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు.

ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, ప్రభుత్వ సృష్టించిన కరవు: నిరంజన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పెద్దగూడెం తండాలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పర్యటించిన ఆయన, ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరవని ఆయన విమర్శించారు.ఈ సందర్భంగా స్థానిక రైతులతో నిరంజన్ రెడ్డి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎల్ నినో పేరు చెప్పి ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టాలను వెంటనే అంచనా వేసి, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో 70 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, పాలమూరు, కల్వకుర్తి పంపులను ప్రభుత్వం నడపడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరాపై ప్రభుత్వానికి కనీస అవగాహన లేకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో సుమారు 2.5 కోట్ల మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. నష్టపరిహారం అందేవరకు రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

ఓటర్ల జాబితాతో బీజేపీ కుట్ర: అఖిలేశ్ యాదవ్

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేయాలని సూచించారు. "మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తుంది. అందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతోంది" అని అఖిలేశ్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రకటించిన తర్వాత అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలే వేల కోట్లు ఖర్చుపెట్టి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) పూర్తి చేసిన తర్వాత, మళ్లీ ఇప్పుడు ూూ= అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం బీజేపీకి అనుకూలంగా జాబితాను మార్చేందుకేనని ఆయన ఆరోపించారు.

విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు.. 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే!

(మొదటి పేజీ తరువాయి)

విరాళాలు అందుకున్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. ఇందులో టైగర్ అసోసియేట్స్ సంస్థ రూ.135 కోట్లతో అతిపెద్ద విరాళదారుగా నిలిచింది.డీఎంకేకు ఇదే ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.191.19 కోట్ల విరాళాలు అందాయి. ఆ పార్టీకి కూడా టైగర్ అసోసియేట్స్ అత్యధికంగా రూ.125 కోట్లు ఇచ్చింది. కోల్‌కతాకు చెందిన ఈ లాటరీ సంస్థకు, తమిళనాడు లాటరీ వ్యాపారవేత్త శాంటియాగో మార్టిన్‌కు వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కంపెనీ రికార్డులు సూచిస్తున్నాయి. ఆ సంస్థలో నియమిత భాగస్వామిగా ఉన్న సుబ్బయన్ నాగరాజన్.. మార్టిన్‌కు చాలాకాలంగా వ్యాపార సహచరుడిగా ఉన్నట్లు సమాచారం.సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేసిన సంస్థగా మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ నిలిచింది. పథకం రద్దు తర్వాత బహిర్గతమైన వివరాల ప్రకారం.. ఈ సంస్థ ఎన్నికల బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.509 కోట్ల విరాళాలు అందించింది.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి.. పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయాలి: అదనపు కలెక్టర్ బి. హరిసింగ్**

సూర్యాపేట, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సూర్యాపేట సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిల్లో అందిన ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.అధికారులు తమ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. స్థానిక స్థాయిలోనే సమస్యలు పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.

ప్రజావాణికి 25 దరఖాస్తులు



సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 25 దరఖాస్తులు అందినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 12, రెవెన్యూ శాఖకు ఒకటి, డీపీఓకు రెండు, డీఈఓకు రెండు, ఇతర శాఖలకు సంబంధించి ఎనిమిది దరఖాస్తులు ఉన్నాయని వివరించారు. ఆయా దరఖాస్తులను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖలకు పంపించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో డీఆర్వో ప్రేమ్‌రాజ్, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, సీపీఓ కిషన్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ అధికారి వెంకటరెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి 'ఓపెన్ ఐస్' అండ.. రూ.8 వేల ఆర్థిక సాయం!

- **తొమ్మిది నెలలుగా ఉపాధికి దూరమైన నరసింహారావుకు చేయూత.. మానవత్వం చాటుకున్న సొసైటీ సభ్యులు, దాతలు**

హుజూర్‌నగర్, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

కిడ్నీ వ్యాధితో పోరాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబానికి ఓపెన్ ఐస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందపురానికి చెందిన ఆసోదు నరసింహారావుకు రూ.8,000 ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుడికి ఈ ఆర్థిక సహాయం కొంత ఊరటనిచ్చింది.

తొమ్మిది నెలలుగా పనులకు దూరం

నరసింహారావు కిడ్నీలు విఫలమవడంతో గత తొమ్మిది నెలలుగా సుతారి పనులకు వెళ్లలేకపోతున్నారు. దీంతో ఉపాధి కోల్పోయి వైద్య పరీక్షల ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన పరిస్థితిని తెలుసుకున్న ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు, మిత్రులు స్పందించి తమవంతు సహాయం అందించేందుకు ముందుకొచ్చారు.

దాతల సహకారంతో రూ.8 వేల సాయం

ఈ సహాయ కార్యక్రమంలో ఓపెన్ ఐస్ సొసైటీ తరఫున సులువ శ్రీను రూ.5,000 అందించగా, లెక్చరర్ రామిశెట్టి శ్రీనివాస్, కన్నెకంటి అంజయ్య, కొమ్ము ముత్తిలింగం ఒక్కొక్కరు రూ.1,000 చొప్పున అందించారు. దీంతో మొత్తం రూ.8,000 నగదును



నరసింహారావుకు అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆర్థిక ఇబ్బందులతో వైద్య సేవలు పొందలేని పేదలకు చేయూతనివ్వడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాజంలో సేవాభావం కలిగిన దాతలు ముందుకొచ్చి బాధిత కుటుంబాలకు తమవంతు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శీలం వెంకీ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ.. రూ.174.32 కోట్లతో భారీ అభివృద్ధి!

- **ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో కోదాడ, హుజూర్‌నగర్‌కు నిధుల వరద**
- **54 రహదారి పనులకు అనుమతులు.. 156.95 కి.మీ. మేర రోడ్ల నిర్మాణం.. 13 మండలాలకు ప్రయోజనం**

హుజూర్‌నగర్, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన రహదారి సౌకర్యాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసింది. మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి చొరవతో మొత్తం రూ.174.325 కోట్లతో 54 రహదారి పనులకు పరిపాలనా అనుమతులు లభించాయి. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీఆర్ఆర్ పథకం కింద ఈ పనులు చేపట్టనున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే గ్రామీణ ప్రజల రవాణా కష్టాలు తగ్గడంతో పాటు మారుమూల గ్రామాలు, గిరిజన తండాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

హుజూర్‌నగర్‌కు రూ.144.325 కోట్లు.. 45 రహదారి పనులు

హుజూర్‌నగర్ నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధికంగా నిధులు కేటాయించింది. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 45 పనులకు రూ.144.325 కోట్లు మంజూరు చేసింది. వీటి ద్వారా 131.55 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు.నేరేడుచర్ల, గరిడేపల్లి, మఠంపల్లి, మేళ్లచెరువు, పాలకీడు, చింతలపాలెం, హుజూర్‌నగర్ మండలాల పరిధిలోని పలు గ్రామాలకు రహదారి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా గ్రామాలను అనుసంధానించే మార్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.నేరేడుచర్ల మండలంలో దిర్శించర్ల--ఎల్‌బీ నగర్, మేడారం--అన్నారం, మేడారం--దాచారం, ఎల్లారం--దాచారం, నర్సయ్యగూడెం తదితర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించారు. గరిడేపల్లి మండలంతో పాటు ఇతర మండలాల్లోనూ గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



కోదాడ నియోజకవర్గానికి రూ.30 కోట్లు

కోదాడ నియోజకవర్గంలోనూ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆరు మండలాల్లో తొమ్మిది రహదారి పనులకు రూ.30 కోట్లు మంజూరు చేసింది. వీటి ద్వారా 25.40 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు.అనంతగిరి, చిలుకూరు, కోదాడ, మునగాల, మోతె, నడిగూడెం మండలాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరిచి, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను తగ్గించేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడనున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ జీవో నంబర్లు 558, 559 ద్వారా సంబంధిత ఉత్తర్వులు జారీ చేశారు.



రహదారుల అభివృద్ధితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయి. రోడ్ల నిర్మాణం పూర్తయితే రైతులు తమ పంటలను వ్యవసాయ మార్కెట్లకు వేగంగా తరలించేందుకు వీలవుతుంది. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సులభంగా చేరుకోవడంతో పాటు గర్భిణులు, రోగులు అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లేందుకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.ముఖ్యంగా మారుమూల గ్రామాలు, గిరిజన తండాలకు ప్రధాన రహదారులతో అనుసంధానం పెరగడం వల్ల ప్రజల ప్రయాణ సమయం తగ్గడంతో పాటు గ్రామీణ వ్యాపారాలు, వ్యవసాయ కార్యకలాపాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది.

నిధుల మంజూరు నుంచి పనుల పూర్తివరకు కీలకం

రహదారి పనులకు పరిపాలనా అనుమతులు లభించడంతో తదుపరి దశల్లో టెండర్లు, పనుల ప్రారంభం, నిర్మాణ నాణ్యత పర్యవేక్షణ కీలకం కానున్నాయి. మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించి, పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేస్తేనే గ్రామీణ ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందనున్నాయి.మొత్తంగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 54 రహదారి పనుల కోసం రూ.174.325 కోట్ల కేటాయింపు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక ముందడుగు. రహదారుల నిర్మాణం పూర్తయితే రెండు నియోజకవర్గాల్లోని 13 మండలాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

చింత్రియాల గ్రామంలో ఘనంగా మహా అన్నదానం

- **శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం.. ముఖ్య అతిథిగా జక్కుల వీరయ్య యాదవ్**

సూర్యాపేట జిల్లా ,చింత్రియాల, ఆగస్టు 19 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం చింత్రియాల గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ జక్కుల వీరయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా జక్కుల వీరయ్య యాదవ్ మాట్లాడుతూ.. అన్నదానం మహోదానమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప పుణ్యకార్యమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందుతాయని అన్నారు. యువత ఐకమత్యంతో ముందుకొచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో యువత ముందుండాలని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన శ్రీకృష్ణ యూత్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యూత్ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ సంబరాల్లో విషాదం.. యువతి మృతి!

- **బతుకమ్మ ఆడుతూ స్పృహతప్పి పడిపోయిన శ్రీవాణి (25).. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి**

ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



సద్దుల బతుకమ్మ సంబరాల్లో విషాదం చోటుచేసుకుంది. బతుకమ్మ ఆడుతున్న సమయంలో ఓ యువతి హఠాత్తుగా స్పృహతప్పి కిందపడటంతో మృతి చెందింది. ఈ ఘటన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలో చోటుచేసుకుంది.చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన శ్రీవాణి (25) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. బతుకమ్మ పండుగ సందర్భంగా తన మేనత్త ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో గ్రామంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడుతుండగా అకస్మాత్తుగా స్పృహతప్పి కిందపడిపోయింది.వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు స్థానికులు తెలిపారు.పండుగ వేళ యువతి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కొలాం ఆదివాసీ క్రాంతివీర్ కొమురం సూరు వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ

- **ఆదివాసీ వీరుల త్యాగాలను భావితరాలకు చాటాలి: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**

ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



కొలాం ఆదివాసీ క్రాంతివీర్ శ్రీ కొమురం సూరు 29వ వర్ధంతి కార్యక్రమ పోస్టర్‌ను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సోమవారం డీసీసీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు ఆమెను కలిసి, ఈ నెల 26న సోమవారం ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణతో ప్రారంభమయ్యే కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ ఆదివాసీ వీరుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు, వారు ఆశించిన లక్ష్యాలు, ఆశయాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

వర్ధంతి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు

ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు తారిఖ్, గోయేగాం సర్పంచ్ దుర్వా ఇసురుబాయి, ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్, పెందోర్ రాజేశ్వర్, ఉత్సవ కమిటీ చైర్మన్, కన్వీనర్ మాడవి రఘునాథ్, ముఠా ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి భూతా భాపురావు, కొలాం సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్, సిడం నాగోరావు, ఇందిరా ఫెలోషిప్ కోఆర్డినేటర్ కోవా ఇంద్ర, ఎస్సీ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు జాడీ ప్రసాద్, సీనియర్ నాయకుడు ఇల్లూరి రాము, మాజీ ఎంపీటీసీ తిరుపతి, యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఇలగల సాయి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉప్పుల కృష్ణ, జాడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఈత బుంగలు ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

భీమదేవరపల్లి, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామ శివారులోని తురకవారి కుంట వద్ద ఉన్న ఈతవనంలో ఈత బుంగలను ధ్వంసం చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గౌడ కులస్తులు పోలీసులను కోరారు.భీమదేవరపల్లి గ్రామానికి చెందిన గౌడ కులస్తులు వేలం పాట ద్వారా ఈ ఈతవనాన్ని దక్కించుకున్నారని, ఈత చెట్ల నుంచి వచ్చే ఆదాయమే తమకు ప్రధాన జీవనాధారమని తెలిపారు. అయితే గత మూడు రోజులుగా రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఈత చెట్లకు ఉన్న ఈత బుంగలను పగలగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనతో తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. పోలీసులు స్పందించి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఈతవనానికి రక్షణ కల్పించాలని గౌడ కులస్తులు విజ్ఞప్తి చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలి: సర్పంచ్ బిల్లా యాదగిరి

వేలేరు, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



వేలేరు మండల కేంద్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మ భవాని కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అమ్మ భవాని కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం అమ్మ భవాని కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరిని అమ్మ భవాని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ భవాని కమిటీ సభ్యులు, ఆత్మ డైరెక్టర్, యూత్ కాంగ్రెస్ నాయకులు, అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిషాసుర మర్దిని అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు


భీమదేవరపల్లి, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు సోమవారం మహార్నవమిని పురస్కరించుకుని అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, శైవశుద్ధి, పుణ్యాహవాచనం, సర్వతోభద్ర మండల ఆవాహన తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం చతుఃషష్టి ఉపచార పూజలతో పాటు అమ్మవారికి దుర్గార్చన చేపట్టారు. అమ్మవారి దివ్య అలంకారాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దుర్గామాత రూపంలో దర్శనమిచ్చిన గణపేశ్వరుడు

గణపురం, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని చారిత్రక కోటగుళ్లలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ గణపేశ్వరుడి లింగాకారానికి దుర్గామాత రూపంలో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు.కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక హారతులు సమర్పించారు. శివలింగాన్ని దుర్గామాత స్వరూపంలో అలంకరించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ విశేష అలంకరణను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన సదస్సు

హనుమకొండ, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

మహిళల భద్రత, రక్షణపై అవగాహన కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ వెస్ట్ కాసం జనత షాపింగ్ మాల్‌లో సోమవారం షీ టీమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్సై రామారావు పాల్గొని మహిళల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.సమాజంలో నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళలపై జరిగే వేధింపులు, ఆకతాయి చేష్టలను అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ఆపద సమయంలో డయల్ 100 లేదా షీ టీమ్ వాట్సాప్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని షాపింగ్ మాల్ ఉద్యోగినులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



దసరాకు నిరంతర విద్యుత్ సరఫరా.. అధికారులకు సీఎండీ ఆదేశాలు

- **పండుగ వేళ విద్యుత్ అంతరాయాలు లేకుండా పకడ్బందీ చర్యలు**

హనుమకొండ, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



దసరా పండుగ సందర్భంగా వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం 18 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ సరఫరా ఏర్పాట్లపై సమీక్షించారు.పండుగ వేళ అత్యవసర పరిస్థితులు మినహా విద్యుత్ నిలిపివేతలు, లైన్ క్లియరెన్స్‌లకు అనుమతించవద్దని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే స్పందించేలా అన్ని సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

వెల్‌నెస్ సెంటర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

హనుమకొండ, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, పరిసరాల పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు.మందుల పంపిణీ కౌంటర్ వద్ద రోగులు ఎక్కువసేపు వేచి ఉండకుండా ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైతే అదనపు కంప్యూటర్‌ను వెంటనే ఏర్పాటు చేసి రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కాకతీయ యూనివర్సిటీలో 49 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అనుమతి

హనుమకొండ, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):



కాకతీయ విశ్వవిద్యాలయంలోని 21 విభాగాల్లో ఖాళీగా ఉన్న 49 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చింది. అత్యధికంగా జువాలజీ విభాగానికి ఆరు పోస్టులు, ఇంగ్లీష్, కామర్స్, ఎకనామిక్స్ విభాగాలకు ఐదేసి పోస్టులు కేటాయించారు.విశ్వవిద్యాలయంలో మొత్తం 68 పోస్టులు ఖాళీగా ఉండగా, తొలి విడతలో 49 పోస్టుల భర్తీకే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కాంట్రాక్ట్ లెక్చరర్ల కొనసాగింపు నేపథ్యంలో మిగిలిన పోస్టుల భర్తీకి అనుమతి లభించలేదు. తాజా నిర్ణయంతో విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల కొరత కొంతమేర తగ్గుతుందని విద్యావర్గాలు భావిస్తున్నాయి.

బతుకమ్మ వేడుకల అనంతరం ఘర్షణ.. వేపల సింగారంలో కత్తులు, రాళ్లతో దాడి!





- **రెండు వర్గాల మధ్య చెలరేగిన వివాదం.. ఇద్దరికి తీవ్ర రక్తగాయాలు**
- **హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

వేపల సింగారం, అక్టోబర్ 20 (ప్రజానేస్తం జ్వాల):

బతుకమ్మ పండుగ ముగిసిన కొద్ది గంటల్లోనే వేపల సింగారం గ్రామంలో ఘర్షణ చోటుచేసుకుంది. వ్యక్తిగత వాగ్వాదం రెండు వర్గాల మధ్య వివాదానికి దారితీయడంతో రాళ్లు, కత్తులతో దాడి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో భార్గవాచారి, మధుసూదనాచారి అనే ఇద్దరికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

చిన్న వాగ్వాదం.. పెద్ద ఘర్షణ!

పోలీసులకు అందిన సమాచారం ప్రకారం.. అక్టోబర్ 19వ తేదీ తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో బతుకమ్మ వేడుకలు ముగిసిన అనంతరం ధరావత్ మహేష్ తన స్నేహితులతో కలిసి వెళ్తుండగా, వారితో ఉన్న సమీర్‌ను చూసిన అతని తండ్రి నాగుల్ మీరా మందలించినట్లు తెలిసింది. ఈ క్రమంలో మహేష్, నాగుల్ మీరా మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం.

బంధువుల రాకతో ఉద్రిక్తత!

తొలుత జరిగిన వాగ్వాదాన్ని మనసులో పెట్టుకున్న నాగుల్ మీరా తన బంధువులతో కలిసి ధరావత్ కృష్ణ ఇంటికి వెళ్లినట్లు సమాచారం. అక్కడ మరోసారి ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ధరావత్ మహేష్, తేజావత్ వంశీ, ధరావత్ కృష్ణ, ధరావత్ శీను, మధు తదితరులు నాగుల్ మీరాతో వచ్చిన భార్గవాచారి, మధుసూదనాచారి, మరికొందరిపై రాళ్లు, కత్తులతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

ఈ ఘర్షణలో భార్గవాచారి, మధుసూదనాచారికి తీవ్ర రక్తగాయాలు కావడంతో వెంటనే వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో కలకలం నెలకొంది.

కేసు నమోదు చేసిన పోలీసులు

ఘటనపై ఎస్ఐ సీహెచ్ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘర్షణకు దారితీసిన పరిస్థితులు, దాడిలో పాల్గొన్న వారి పాత్రపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

డిండి ఎత్తిపోతల పథకానికి ఎదుల్ల నుంచే కృష్ణా జలాలు ఇవ్వాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్

నల్గొండ, ప్రజానేస్తం జ్వాల:

డిండి ఎత్తిపోతల పథకానికి ఎదుల్ల నుంచే కృష్ణా జలాలను అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకానికి ఎదుల్ల నుంచి నీటిని అందించడం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి ప్రయోజనాలు చేకూర్చాలని వారు కోరారు.



స్వచ్ఛతా హీ సేవా.. వరంగల్ నిట్‌లో శ్రమదానం



హనుమకొండ, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

పరిశుభ్రమైన క్యాంపస్, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా వరంగల్ నిట్ ప్రాంగణంలో 'స్వచ్ఛతా హీ సేవా', ఎస్‌సీడీపీఎం-6 (SCDPM-6) ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది క్యాంపస్ పరిసరాలను శుభ్రపరిచేందుకు శ్రమదానంలో పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. క్యాంపస్‌ను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సంస్థ అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొని పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కాజీపేటలో గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

- **ఐదుగురు నిందితుల పట్టివేత.. రూ.4.25 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**



హనుమకొండ, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.నిందితుల నుంచి 500 గ్రాముల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.4.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.ప్రాథమిక విచారణలో నిందితులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి కాజీపేటకు తీసుకొచ్చి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

వరంగల్ నిట్‌లో సాఫ్ట్‌వేర్ పరిశోధన కేంద్రం ప్రారంభం

హనుమకొండ, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

వరంగల్ నిట్‌లో సాఫ్ట్‌వేర్ పనితీరు విశ్లేషణ, పరిశోధన కేంద్రం (SS-SPARC) సోమవారం ప్రారంభమైంది. నిట్ 1983 బ్యాచ్ పూర్వ విద్యార్థి, అమెరికాలోని ఒరాకిల్ సంస్థలో పనిచేస్తున్న శ్రీనివాస్ వి. అట్లూరి అందించిన రూ.12.5 లక్షల విరాళంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ పనితీరు పరీక్షలు, డేటాబేస్ విశ్లేషణలో ప్రాయోగిక శిక్షణ అందనుంది. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి సమక్షంలో జరిగిన ప్రారంభోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కేతవారిగూడెంలో వైభవంగా మహిషాసుర మర్దిని అవతారంలో దుర్గమ్మ దర్శనం





- అమ్మవారి సన్నిధిలో మహా అన్నదానం.. 3 వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ
- ముక్కుపుడకకు రూ.100 మాత్రమే.. భక్తులకు అందుబాటులోకి తెచ్చిన ఆలయ కమిటీ నిర్ణయంపై ప్రశంసలు

కేతవారిగూడెం, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేతవారిగూడెం గ్రామంలోని దుర్గమ్మ తల్లి సోమవారం మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కమిటీ సభ్యులు అత్యంత సుందరంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో కళకళలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో మూడు వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

పూజల అనంతరం మహా అన్నదానం ప్రారంభం

ఉదయం మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురోహితులు శ్రీ రామయ్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు కలిసి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నదాన కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.

అన్నదాన కార్యక్రమం విజయవంతానికి సహకరించిన భజన బృందాలకు కమిటీ కృతజ్ఞతలు

దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన



45 మంది భజన బృందాల సభ్యులకు ఆలయ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. భక్తిశ్రద్ధలతో సేవలందిస్తూ అన్నదాన కార్యక్రమం సజావుగా సాగేందుకు సహకరించిన వారి సేవలను కమిటీ అభినందించింది. ఈ కార్యక్రమానికి శ్రీ అంబాత్రేయ భజన బృందం, శ్రీ మురళీకృష్ణ బృందం, శ్రీ కనకదుర్గమ్మ భజన బృందం, శ్రీ లక్ష్మీ నరసింహ సేవా సమితి సభ్యులు స్వచ్ఛందంగా హాజరై సేవలందించారు. అమ్మవారి సేవలో భాగంగా భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు బృందాల సభ్యులు చూపిన సేవాభావం అభినందనీయమని కమిటీ పేర్కొంది. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరుతూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసింది.

రూ.100కే అమ్మవారి ముక్కుపుడక.. కమిటీ నిర్ణయంపై హర్షం

దుర్గమ్మ తల్లి అనగానే గుర్తుకొచ్చే ముక్కుపుడకను ప్రతి భక్తుడికి అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆలయ కమిటీ ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. సాధారణంగా వేలంపాట నిర్వహించే విధానానికి భిన్నంగా, ముక్కుపుడకను కేవలం రూ.100 రుసుముతో భక్తులకు అందుబాటులో ఉంచింది. ఈ నిర్ణయంపై గ్రామ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆలయ కమిటీని అభినందించారు. అమ్మవారి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో తీసుకున్న ఈ నిర్ణయం భక్తుల ప్రశంసలు అందుకుంది.

మంగళవారం 20.10.2026 నాడు రాజరాజేశ్వరి దేవి అవతారంలో అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం అమ్మవారికి నవరాత్రుల్లో అలంకరించిన చీరల వేలంపాట, ముక్కుపుడక లక్కీ డ్రా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం అమ్మవారి శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. భక్తి.. సేవ.. సమైక్యతకు ప్రతీకగా కేతవారిగూడెం దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక సందడిని నింపుతున్నాయి.

బూరుగడ్డ అభివృద్ధికి రూ.14.30 కోట్ల నిధులు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో నాలుగు రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరు

హుజూర్‌నగర్, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

బూరుగడ్డ గ్రామ అభివృద్ధికి మహర్దశ పట్టనుంది. గ్రామానికి అనుసంధానంగా ఉన్న నాలుగు ప్రధాన రహదారుల అభివృద్ధికి రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.14.30 కోట్ల నిధులు మంజూరయ్యాయని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాధిక అరుణ్ కుమార్ దేశ్‌ముఖ్ తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. బూరుగడ్డ నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఇందులో నక్కగండి నుంచి బేతవోలు వరకు 5 కిలోమీటర్ల రహదారికి రూ.5.30 కోట్లు, బూరుగడ్డ నుంచి హుజూర్‌నగర్ బీటీ రోడ్డు వరకు 4 కిలోమీటర్ల రహదారికి రూ.4.20 కోట్లు, బూరుగడ్డ నుంచి కొత్త మంగాపురం, గౌండ్లగడ్డ వరకు 4.5 కిలోమీటర్ల రహదారికి రూ.3.225 కోట్లు, మర్రిగూడెం నుంచి బూరుగడ్డ వరకు 1.5 కిలోమీటర్ల రహదారికి రూ.1.60 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఈ రహదారుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బూరుగడ్డ గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగడ్డ సర్పంచ్ ఎరగని రాధా నాగరాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తాం

- కలిసికట్టుగా పనిచేస్తాం.. పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యం: కేతవారిగూడెం బీఆర్ఎస్ నాయకులు



గరిడేపల్లి, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని కేతవారిగూడెం గ్రామ నాయకులు తెలిపారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేతవారిగూడెం నాయకులు ఎన్నికల్లో పార్టీ శ్రేణుల సమిష్టి కృషి, సమన్వయం కీలకమని పేర్కొన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త వంటెద్దు నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగు రాకేష్ రెడ్డి సమక్షంలో నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తూ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేతవారిగూడెం సర్పంచ్ బొల్లెపల్లి రామనాధం, మాజీ సర్పంచ్ కీత జ్యోతి రామారావు, మాజీ ఉపసర్పంచ్ గుండు అంజమ్మ సైదులు, నియోజకవర్గ నాయకులు పొల్లంపల్లి ఆనంద్ బాబు, పిడమర్తి అంజయ్య, తెలబాటి నరేష్, గూడెపు అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ అవగాహన సదస్సులు

- ఓటరు నమోదుపై పట్టభద్రులకు అవగాహన కల్పించిన ఏనుగుల రాకేష్‌రెడ్డి,



ఒంటెద్దు నరసింహారెడ్డి

గరిడేపల్లి, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి మండల కేంద్రాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. పట్టభద్రులందరికీ ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు, పార్టీ శ్రేణులు, అభిమానులు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి మండల గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు

- రూ.174.32 కోట్లతో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణం.. పెండెం సుజాత శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు

గరిడేపల్లి, అక్టోబర్ 19 (ప్రజానేస్తం జ్వాల):


సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో గ్రామీణ రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.174.325 కోట్ల నిధులు మంజూరు చేసింది. మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి కృషితో ఈ నిధులు మంజూరయ్యాయని గరిడేపల్లి మండల మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ పెండెం సుజాత శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీఆర్ఆర్ పథకం కింద రెండు నియోజకవర్గాల్లోని 13 మండలాల్లో 54 రహదారి పనులకు అనుమతులు లభించాయని పేర్కొన్నారు. మొత్తం 156.95 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

గరిడేపల్లి మండలంలో పలు రహదారులకు నిధులు

గరిడేపల్లి మండలంలో తాళ్లమల్కాపురం--జెర్రిపోతులగూడెం, ముత్యాలనగర్--కాచవారిగూడెం మీదుగా హుజూర్‌నగర్ బైపాస్, కట్టవారిగూడెం--జెర్రిపోతులగూడెం, సర్వారం--కేతవారిగూడెం, సర్వారం--తేకులవాగు తదితర రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే గ్రామీణ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సౌలభ్యం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. మారుమూల గ్రామాలకు ప్రధాన రహదారులతో అనుసంధానం ఏర్పడుతుందని తెలిపారు.

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి, సహకరించిన కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి పెండెం



సుజాత శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. రహదారుల నిర్మాణంతో గరిడేపల్లి మండలంలోని గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.